క్లుప్తంగా

దివ్యాంగ ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం రేపు

పరవాడ: పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్ష, అలిమ్‌కో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 9 గంటలకు అనకాపల్లి మున్సిపల్ బాలికల పాఠశాలలో 0 నుంచి 18 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈవో దివాకరరావు తెలిపారు. శిబిరంలో కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాలకు సంబంధించిన దివ్యాంగ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. దివ్యాంగ విద్యార్థులకు వైద్య నిర్ధారణ పరీక్షల అనంతరం ఉచితంగా ఉపకరణాలను అందించనున్నట్లు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన తప్పనిసరి

పెందుర్తి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై యువతకు అవగాహన కలిగించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పి.శేషశైలజ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల జాబితాపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటు హక్కు నమోదు నిరంతర ప్రకియ అని పేర్కొన్నారు. తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ల పంపిణీ

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పంపిణీ చేశారు. సుజాతనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు వాటిని ఎమ్మెల్యే అందించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక కార్యాలయాన్ని పరిశీలించారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



సంగీత కచేరి చేస్తున్న శ్రీరంగం నాగలక్ష్మి బృందం

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సంగీత కచేరి కాలనీవాసులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. సంగీత భారతి విద్యాలయం విద్వాంసురాలు శ్రీరంగం నాగలక్ష్మి బృందం కచేరీ నిర్వహించింది. కాలనీ అసోసియేషన్, సింహపూరి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

దసరాకు ప్రత్యేక రైళ్లు నడపాలని వినతి

అగనంపూడి: విశాఖ నుంచి ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులకు అనువుగా ఉండే విశాఖ నర్సాపురం ఎక్స్‌ప్రెస్, అలాగే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేయడంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని తూర్పు కోస్తా రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ రైల్వే అధికారులను వేర్వేరు వినతి పత్రాల్లో కోరారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి లక్షలాది మంది భవానీ భక్తులు విజయవాడ వెళ్లనున్నారని, ఈ క్రమంలో శ్రీకాకుళం, విశాఖ, నర్సాపురం మధ్య ప్రత్యేక రైళ్ల నడపాలని ఆయన కోరారు.

'మాది పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం. మాకు సర్వే నెం. 80/1లో డి-ఫారం భూమి ఉంది. దాన్ని స్థానిక సర్పంచ్ మడక అప్పలరాజు ఆక్రమించుకున్నారు. ఏడాదిన్నర నుంచి పోరాటం చేస్తున్నాం. చివరకు హైకోర్టులో న్యాయం దక్కింది. తహసీల్దార్ కూడా మాకు అనుకూలంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అయినా మాకు చెందిన 6 సెంట్ల స్థలంలో ప్రస్తుతం సర్పంచ్ నిర్మాణాలు చేస్తున్నారు. అడిగితే నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి'–దళితుడు బంగారయ్య విన్నపం ఇది.

జెర్రిపోతులపాలెంలో.. కబ్జాల పర్వం

- ప్రభుత్వ, డి–ఫారం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న సర్పంచ్
- అధికారులను బెదిరించి రోడ్డునాక్రమించి వాణిజ్య సముదాయాలు
- మరోచోట దళితునికి చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం
- కోర్టు ద్వారా తహసీల్దార్ ప్రొసీడింగ్స్ ఇచ్చినా ఆగని దౌర్జన్యం



జెర్రిపోతులపాలెంలో సర్వే నెం.80/1లో దళితుడు బత్తిన బంగారయ్య స్థలాన్ని ఆక్రమించి సర్పంచ్ చేస్తున్న నిర్మాణం



జెర్రిపోతులపాలెంలో సర్వే నెం.79/3లోని డి-ఫారం భూమిలో సర్పంచ్, కుటుంబ సభ్యులు నిర్మిస్తున్న వాణిజ్యసముదాయం

పెందుర్తి: అధికారం ఉంది.. అండగా సర్పంచ్ అనే పదవి ఉండనే ఉంది. దీనికి తోడు నియోజకవర్గ ప్రజాప్రతినిధి వత్తాసు సరేసరి. ఇంకేముంది. ప్రభుత్వ స్థలమైనా అది మనదే అన్నట్లు ఉంది ఆ సర్పంచ్ తీరు. గ్రామంలో దళితునికి చెందిన డి–ఫారం భూమిని చెరబట్టి దురాక్రమణకు పాల్పడ్డారు. కోర్టు తీర్పును దిక్కరించి.. రెవెన్యూ అధికారుల ప్రొసీడింగ్స్‌ను బేఖాతరు చేస్తూ దర్జాగా నిర్మాణం చేపడుతున్నారు. అదే సర్పంచ్ మరోచోట డి–ఫారం భూమిని ఆక్రమించి ఏకంగా వాణిజ్య సముదాయాన్నే నిర్మిస్తున్నారు. రెవెన్యూ అధికారులను అధికారం అండతో బెదిరించి నిర్మాణాలు కూడా చేపట్టారు. కూటమి నాయకుల కబ్జాకాండకు ఈ నిర్మాణాలు పరాకాష్టగా నిలుస్తున్నాయి.

దళితుని భూమిని చెరబట్టి

గ్రామంలోని సర్వే నెం.80/1లో స్థానిక దళిత సామాజికవర్గానికి చెందిన బత్తిన బంగారయ్యకు ఆరు సెంట్లు భూమి ఉంది. కూటమి అధికారంలోకి రాగానే ఆ భూమిని సర్పంచ్ అప్పలరాజు, అతని కుటుంబసభ్యులు ఆక్రమించారని ఆరోపిస్తూ బంగారయ్య హైకోర్టును ఆశ్రయించాడు. ఇరువురి పత్రాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాల్సిందిగా హైకోర్టు పెందుర్తి తహసీల్దార్‌ను సూచించింది. పత్రాలు పరిశీలించాక ఈ ఏడాది జూన్‌లో బంగారయ్యదే ఆ స్థలం అంటూ తహసీల్దార్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అయినా సదరు సర్పంచ్ తాజాగా ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. మరోవైపు ఇదే గ్రామంలోని సర్వే నెం.79/3లోని డి-ఫారం భూమిని ఆక్రమించిన సర్పంచ్ వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. గతంలో దీన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నా.. తాజాగా మళ్లీ మొదలుపెట్టారు. ఆయా నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

ఎవరు ఆపుతారో చూస్తాం..

పై సర్వే నెంబర్లలోని భూముల్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించలేని పరిస్థితి. అంతా తెలిసినా అధికార పార్టీ ప్రజాప్రతినిధి అన్న కారణంగా కనీసం అటు వైపు కన్నెత్తి చూడట్లేదు. ఒకవేళ రెవెన్యూ అధికారులు ఆయా నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రయత్నం చేసినా కూటమి 'ముఖ్య'నాయకులతో ఫోన్ల ద్వారా బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. మరోవైపు ఈ ఆక్రమణల పర్వంపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఇప్పటి వరకు చర్యలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం

జెర్రిపోతులపాలెంలో జరుగుతున్న నిర్మాణాలను ఇటీవల పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. వారి ఆదేశాలు వచ్చేవరకు నిర్మాణాలు చేయవద్దని వారికి చెప్పాం. తాజాగా నిర్మాణాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. మా సిబ్బందిని తక్షణమే పంపించి పరిశీలిస్తాం.

– ఐ.వెంకటఅప్పారావు, తహసీల్దార్, పెందుర్తి

వృద్ధాశ్రమానికి పెందుర్తి పోలీసుల వితరణ



నగదును లయోలా వృద్ధాశ్రమానికి అందిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పెద్ద మనసు చాటుకున్నారు. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారి కోసం తమవంతు సాయంగా తమ వేతనాల నుంచి తలా కొంత సొమ్ము సేకరించారు. అలా వచ్చిన మొత్తం రూ.50 వేలును ఆశ్రమంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీఐ కేవీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఇటీవల నగరంలోని నిర్వహించిన డ్రైవ్‌లో 45 మంది నిరాశ్రయులను లయోలాలో చేర్పించామన్నారు. వారి పోషణ ఆశ్రమానికి భారం కాకూడదని తమవంతుగా ఈ మొత్తాన్ని సమకూర్చినట్లు వెల్లడించారు. సాయం చేయడానికి పిలుపునివ్వగా సహకరించిన స్టేషన్ సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎన్వీ భాస్కరావు, దేముడుబాబు, చిన్నబాబు, జిలానీ, విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.70 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. గురువారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సింహగిరిపై కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకుడు, సిబ్బంది



తిరువీధిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- విశేషంగా స్వామికి తిరువీధి
- శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం విశేషంగా హోమాలు, పారాయణాలు జరిగాయి. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి సింహగిరి మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. రాత్రి పవిత్రాల సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను, చక్రపెరుమాళ్లను వేదికపై కొలువుంచారు. పవిత్రాలను అర్చకులు శిరస్సుపై పెట్టుకుని ఆలయ బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం పవిత్రాలకు విశేష పూజలు జరిపి, ఉత్సవమూర్తులకు, ఆలయ ప్రాంగణాలకు, ఆలయ శిఖరానికి సమర్పించారు. విశేష హారతులు అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలను జరిపారు. ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శుక్రవారం పవిత్రవిసర్జన జరగనుంది.

కురసాల సత్యనారాయణ మృతి తీరని లోటు



దివంగత కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: దివంగత కురసాల సత్యనారాయణ మృతి తీరనిలోటని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ పెద్దకర్మ కాకినాడలో గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అమర్‌నాథ్, యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, భీమిలి సమన్వయకర్త చిన్నశ్రీను, అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ తదితరులు దివంగత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నబాబుకు తమ సానుభూతి తెలిపారు.

వెలుగుతూ.. వెలిగించే దీపం గురువు

సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ప్రథమ స్థానంలో నిలిచేది గురువు. పిల్లల్లో అజ్ఞాన చీకట్లను తొలగించి విజ్ఞాన జ్యోతుల్ని వెలిగించేది గురువు. తను వెలుగుతూ.. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది గురువు. అలాంటి గురువుల్ని స్మరించుకునేలా శుక్రవారంనాటి గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని విద్యా సంస్థల్లో ఒక రోజు ముందుగానే వేడుకలు ఘనంగా జరిగాయి.



ఆరిపాకలో ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్



పరవాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబును సత్కరిస్తున్న విద్యార్థులు

- ఊరూవాడా ఘనంగా గురుపూజోత్సవం
- ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



పురుషోత్తపురంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, పిల్లలు



విజినిగిరిపాలెం ఎంపీపీ స్కూల్లో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం విద్యావతి



ఉపాధ్యాయ వేషధారణలో విద్యార్థిని

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్‌కు ఘన నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు.

● పురుషోత్తపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద హెచ్‌ఎం చిరికి శ్రీనివాసరావు అంజలి ఘటించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: ఉపాధ్యాయులకు సంఘంలో ఎంతో గౌరవం ఉందని, దాన్ని ప్రతి ఉపాధ్యాయుడు కాపాడుకోవాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వినోద్‌బాబును కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలం: 98వ వార్డు విజినిగిరిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని టి.పి.విద్యావతి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణల్లో అలరించారు. సహవిద్యార్థులకు పాఠాలు చెబుతూ ఆకట్టుకున్నారు.

సబ్బవరం: మండంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పూర్వ ఉపాధ్యాయులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అరసాడ సూర్యనారాయణ, పూర్వ ఉపాధ్యాయులు బుద్ధ నరసింహమూర్తి, నిమ్మల సత్యనారాయణ, ఊడి కృష్ణమూర్తితో పాటు ఎంఈవో-2, హెచ్‌ఎం ఎంజే రవీంద్రబాబు తదితరులను జ్ఞాపికలతో సత్కరించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు, వక్తలు మాట్లాడుతూ విద్య వినయాన్ని, గౌరవాన్ని ఇస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చి భారత రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా చేసుకోవడం ఆయనకు అందించే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలిశెట్టి సురేష్‌రాజ్‌తో పాటు ఉప సర్పంచ్ శరగడం శ్రీనివాసరావు, బి.మహలక్ష్మినాయుడు, మళ్ల కోటేశ్వరరావు, ఎన్‌పీ రాజు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో భారీ అన్నసమారాధనలు



93వ వార్డు సాయిమాధవ్‌నగర్‌లో యూత్ ఏర్పాటు చేసిన గణపతి సన్నిధిలో అదీప్‌రాజ్



బంగారమ్మపాలెం ఎస్సీ కాలనీలో అన్నసంతర్పణ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు



రాంపురంలో వడ్డన చేస్తున్న అదీప్‌రాజ్, శిరీష దంపతులు



పురుషోత్తపురంలో లడ్డూను వేలం పాడుకున్న వారికి అందిస్తున్న నిర్వాహకులు



పురుషోత్తపురం కంఫర్ట్ హోమ్స్‌లో ఆకట్టుకున్న చిన్నారులు నృత్యం



పెదగొల్లలపాలెంలో స్వామిని దర్శించుకుంటున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు



అన్నసమారాధనలో ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

- ఊరేగింపుల మధ్య ఘనంగా నిమజ్జనాలు

పెందుర్తి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలుచోట్ల ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 93వ వార్డు సాయిమాధవ్‌నగర్ యూత్, 97వ వార్డు గిరిప్రసాద్‌నగర్‌లోని ఐకాన్ యూత్, రాంపురంలోని గణపతి మండపాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష దంపతులు సందర్శించారు. పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద జరిగిన అన్నసమారాధనలను ప్రారంభించారు. నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చందుయాదవ్, వినోద్, జగదీష్, పీతల ఆకాష్, మల్లువలస సన్ని, రాంబాబు, చందక జతిన్, సాయిరామ్‌పాత్రుడు, లంక కార్తిక్, స్వామి నాయుడు, జగరపు రమేష్, బాదిరెడ్డి కృష్ణ, అన్నంరెడ్డి నగేష్, తులసి, బాదిరెడ్డి నవీన్‌పాల్గొన్నారు.

● కోట్నివానిపాలెం కాలనీలో కమిటీ కుర్రాళ్ల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద జరిగిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ ప్రారంభించారు. రాత్రి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది.

● పురుషోత్తపురం వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలోని సంపత్ వినాయక మండపం వద్ద సాయంత్రం జరిగిన లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన పిల్లా కిషోర్, పిల్లా అప్పలరాజు రూ.13,516కు దక్కించుకున్నారు.

● పురుషోత్తపురం కంఫర్ట్ హోమ్స్‌లోని విజయ గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు జరిగాయి.

● నరవలోని ఆరాధన చిల్డ్రన్ హోమ్‌కు చెందిన చిన్నారులు నృత్యం ఆకట్టుకుంది. గాయకుడు ఉమామహేశ్వరరావు తన ఆధ్యాత్మిక గీతాలతో భక్తిపారవశ్యంలో ముంచారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జ్యోతి, దివ్య, కోశాధికారి శ్రీనివాసశర్మ, పండితులు భాస్కరరావు శర్మ, రామారావు శర్మ, ఆరాధన హోమ్ నిర్వాహకురాలు ప్రియ బాంధవి, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సందర్శించారు.

● బంగారమ్మపాలెం ఎస్‌సీ కాలనీలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం స్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు.

● గొల్లలపాలెంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్, గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, పార్టీ నేతలు, గ్రామ పెద్దలు దనిమిరెడ్డి శ్రీనివాసరావు, దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్, దుర్గాప్రసాద్, కొమ్ము కనకరాజు, మధు, నవీన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: తానాం గ్రామంలో రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయకుడిని గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిపారు. మాజీ సర్పంచ్ పైల రామారావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు వర్రి పరదేశినాయుడు, యూత్ సభ్యులు పైల ఈశ్వరరావు, బి.నాని, పి.కృష్ణ, ఆర్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రావాడ శివారు రేకవానిపాలెంలో అనుపు మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు వియ్యపు చిన్న, మోటూరు సూరిబాబు, రేక రామారావు, చుక్క లక్ష్మితాతారావు, రేక సత్యనారాయణలు సిద్ధి వినాయకుడిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధ జరిపారు.

● నాయుడుపాలెంలో వినాయకుడి లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన దుంగల శిరీష శ్రీను దంపతులు రూ.2,100కు లడ్డూ దక్కించుకున్నారు.

అప్పన్న తొలిపావంచా పరిసరాల సుందరీకరణ


- జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో పనులు



సుందరీకరణ పనులపై చర్చిస్తున్న జీవీఎంసీ జోన్-8, దేవస్థానం అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ తొలిపావంచా పరిసరాలు త్వరలోనే కొత్త రూపుని సంతరించుకోనున్నాయి. జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో ఆయా ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్-8 అధికారులు, సింహాచలం దేవస్థానం అధికారులు గురువారం సమావేశమై, సంబంధిత పనులపై చర్చించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న నిధులతో ఏయే పనులు చేస్తామో జీవీఎంసీ అధికారులు దేవస్థాన సిబ్బందికి వివరించారు. ప్రధానంగా కొండ దిగువ ట్రాన్స్‌పోర్టు బస్టాండ్ ఏరియాని అభివృద్ధి చేసి, బస్‌బేలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త తొలిపావంచా ఎదురుగా రోడ్డుపై విద్యుద్దీపాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంచనున్నట్లు తెలిపారు. కారు స్టాండ్ సమీపంలో శంఖు చక్ర నామాలు, సింహాచలం పేరుతో లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. హవేళి ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, కారు పార్కింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాలపై దేవస్థానం అధికారులు సమ్మతించారు. సమావేశంలో జోన్-8 జెడ్సీ హేమావతి, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఏఈవో రమణమూర్తి, ఏఈలు రవిరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



పరవాడ: ఫార్మాసిటీలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డాడు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.